ఉద్యమకారుల సమస్యలపై చర్చించండి



ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

సికింద్రాబాద్‌: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆందోళనలు చేసిన ఉద్యమకారుల సమస్యలపై శాసనసభలో చర్చించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు వారు గురువారం ఎమ్మెల్సీ కవితను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారి అనిల్‌కుమార్‌ మాట్లాడుతూ ఉద్యమకారులకు పెన్షన్లు, ఇంటి స్థలాలు ఇప్పిస్తామని కాంగ్రెస్‌ మెనిఫెస్టోలో పేర్కొందని, అధికారం చేపట్టి ఏడాది గడిచినా ఉద్యమకారుల సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. శాసన మండలిలో ఉద్యమకారుల సమస్యలపై చర్చించి తమకు న్యాయం చేయాలని వారు ఎమ్మెల్సీ కవితను కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు జానకిరెడ్డి, కొంతం యాదిరెడ్డి, శ్యామల, జగన్‌యాదవ్‌, బాబులాల్‌ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్‌



ఇఫ్తార్‌ విందులో పాల్గొన్న పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌ గౌడ్‌

బౌద్ధనగర్‌: ఇఫ్తార్‌ విందులు మత సామరస్యానికి ప్రతీక అని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌ కుమార్‌ గౌడ్‌ అన్నారు. బుధవారం రాత్రి వారాసిగూడలో కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు స్వర్గీయ జహంగీర్‌ నివాసంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌ గౌడ్‌ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన అన్ని హక్కులు దేశ ప్రజలందరికీ దక్కాలన్నదే కాంగ్రెస్‌ ధ్యేయమన్నారు. మతం ఆధ్యాత్మిక, భక్తి, విశ్వాసానికి సంబంధించిన పవిత్ర భావన అని, రాజకీయం, ఓట్ల సాధనం కాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు మహ్మద్‌ అజ్గర్‌, ఖైరతాబాద్‌ డీసీసీ అధ్యక్షుడు రోహిత్‌ రెడ్డి, సాయికుమార్‌, అబ్దుల్‌ బషీర్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కు అందజేత



లాలాపేట: పేద, మధ్యతరగతి ప్రజలు మెరుగైన కార్పొరేట్‌ వైద్యం పొందేందుకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ ఎంతగానో ఉపయోగపడుతుందని డిప్యూటీ మేయర్‌ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి అన్నారు. మెదక్‌ జిల్లాకు చెందిన రామా గౌడ్‌ గత కొంత కాలంగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతూ ఆర్థిక సాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు.సీఎం రిలీఫ్‌ ఫండ్‌ ద్వారా మంజూరైన చెక్కును గురువారం తార్నాకలో డిప్యూటీ మేయర్‌ రామా గౌడ్‌ కుటుంబ సభ్యులకు అందజేశారు.

టీబీ నియంత్రణపై అవగాహన

అడ్డగుట్ట: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం లాలాపేట టీబీ యూనిట్‌ ఆధ్వర్యంలో అడ్డగుట్టలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ టీబీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. అనంతరం, 9వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్‌ భరద్వాజ్‌, ఉపాధ్యాయులు రజిని, సీనియర్‌ ట్రీట్‌మెంట్‌ సూపర్‌వైజర్‌ రాజు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌ దేవాలయ హుండీల లెక్కింపు

సనత్‌నగర్‌: హనుమాన్‌ దేవాలయ (సెవన్‌ టెంపుల్స్‌) ప్రాంగణంలోని వివిధ ఆలయాల హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం జరిగింది. మొత్తం 20 హుండీలకు సంబంధించి 50 రోజులకు గాను రూ.3,81,402ల ఆదాయం సమకూరింది. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌ శ్రీదేవి, ఈఓ సత్యనారాయణనాయుడు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు కొనసాగింది. కార్యక్రమంలో అర్చకులు రిపుంజయశర్మ, విజయేంద్ర, సిబ్బంది కాటం శ్రీనివాస్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- సికింద్రాబాద్‌ డివిజన్‌ పరిధిలో 28 సెంటర్లు.. 7,287 మంది విద్యార్థులు
- సనత్‌నగర్‌ పరిధిలో 24 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 6 వేల మంది విద్యార్థులు

సికింద్రాబాద్‌: 10వ తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో సికింద్రాబాద్‌, సనత్‌నగర్‌ డివిజన్ల పరిధిలో పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. నెల రోజుల క్రితమే సెంటర్లను ఎంపిక చేసిన అధికారులు రెండు మూడు రోజులుగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతులను కల్పిస్తున్నారు. సికింద్రాబాద్‌ నియోజకవర్గ పరిధిలోని ముషీరాబాద్‌, మారేడుపల్లి మండలాల అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



వారాసీగూడ సెయింట్‌ జాన్స్‌ గ్రామర్‌ పాఠశాలలో మోడల్‌ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

- వేసవి నేపథ్యంలో ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పరీక్షా కేంద్రాల్లో గాలి వెలుతురు ఉండేలా చర్యలు తీసుకున్నారు. తాగునీటిని అందుబాటులో ఉంచారు. కొద్ది రోజుల క్రితమే పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసిన అధికారులు ఆయా పాఠశాలల్లో సీసీ కెమెరాలు, టాయ్‌లెట్లు, ఫ్యాన్లు తదితర సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నారు.

హాజరుకానున్న 7 వేల మంది విద్యార్థులు...

నియోజకవర్గ పరిధిలోని ఐదు డివిజన్లలో 39 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 29 ప్రైవేటు, 9 ప్రభుత్వ, ఒక రైల్వే ఉన్నత పాఠశాలల నుంచి 7,287 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఇప్పటికే హాల్‌టికెట్లు జారీ చేశారు.

- ఈ నెల 21 నుంచి ఏప్రిల్‌ 4 వరకు కొనసాగనున్న పరీక్షల నిర్వహణకు 28 సెంటర్లను ఏర్పాటు చేసిన విద్యాశాఖ అధికారులు 418 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. స్క్వాడ్‌లు, సూపరింటెండెంట్లు, కస్టోడియన్లు, రూట్‌ ఆఫీసర్లు తదితర పర్యవేక్షణ విధుల నిమిత్తం మరో 68 మంది అధికారులు, ఉద్యోగులను నియమించినట్లు ముషీరాబాద్‌, మారేడుపల్లి మండలాల విద్యాశాఖ డిప్యూటీ అధికారులు బాలు నాయక్‌, శ్రావణ్‌కుమార్‌ తెలిపారు.
- అరగంట ముందే చేరుకోవాలి.
- పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు విద్యాశాఖ అధికారులు పలు సూచనలు చేశారు.
- ఉదయం 9.30 గంటల నుంచి పరీక్ష ప్రారంభం కానున్న నేపథ్యంలో అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుందన్నారు. తొలి పరీక్షకు ముందు రోజు తాము పరీక్ష రాయాల్సిన సెంటర్‌ ఎక్కడ ఉందో గుర్తించాలి.
- విద్యార్థులకు వైద్యసేవలను అందుబాటులో ఉంచుతున్నామని, హాల్‌ టికెట్లు పొందని విద్యార్థులు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్‌ చేసుకునే హాల్‌టికెట్లను కూడా పరీక్షకు అనుమతిస్తున్నట్లు తెలిపారు.

మండలం	పాఠశాలలు
మారేడుపల్లి	16
ముషీరాబాద్‌	23
విద్యార్థుల సంఖ్య:	7287

పీఎస్‌ల వారీగా పరీక్షా కేంద్రాలు ఇవీ

తుకారాంగేట్‌	04
లాలాగూడ	05
ఓయూ	08
చిలకలగూడ	06
వారాసీగూడ	05
మొత్తం	28

ఒక్కో కేంద్రానికి 14 మంది ఇన్విజిలేటర్లు

సనత్‌నగర్‌: సనత్‌నగర్‌ నియోజకవర్గ పరిధి కిందికి వచ్చే సికింద్రాబాద్‌ మండలంలో 13, అమీర్‌పేట మండలంలో 10, బాలానగర్‌ మండలంలో ఒక సెంటర్‌ మొత్తం 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఆయా కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్‌ సంక్షేమ హాస్టళ్లకు చెందిన 6 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. బెంచీకి ఇద్దరి చొప్పున ఒక్కో గదిలో 12 బెంచీలను ఏర్పాటు చేసిన అధికారులు 24 మంది విద్యార్థులు పరీక్ష రాసేలా చర్యలు తీసుకున్నారు. ఒక్కో కేంద్రానికి ఒకరు చొప్పున చీఫ్‌ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్‌ ఆఫీసర్లతో పాటు ఫ్లయింగ్‌ స్క్వాడ్స్‌, పోలీస్‌ కస్టోడియన్లను నియమించారు. ఒక్కో కేంద్రానికి 14 మంది చొప్పున ఇన్విజిలేటర్లను నియమించారు. ఇప్పటికే పోలీస్‌ స్టేషన్లకు పరీక్షా పేపర్లను భద్రపరిచారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ అమలు చేయనున్నారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో జిరాక్స్‌ సెంటర్లు తెరవవద్దని ఇప్పటికే నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షల నేపథ్యంలో దృష్ట్యా ఎలాంటి ట్రాఫిక్‌ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.

'బడ్జెట్‌పై అపోహలు వద్దు'

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర బడ్జెట్‌ పై అపోహలు వద్దని తెలంగాణ ప్రజల దశ దిశ మార్చేలా బడ్జెట్‌ రూపకల్పన జరిగిందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై బీఆర్‌ఎస్‌ నేతలు విమర్శలు చేయడం అర్థరహితమన్నారు. మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్‌ఎస్‌ నేతలకు బడ్జెట్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. బడ్జెట్‌ కేటాయింపుల్లో విద్య, వైద్య, సంక్షేమ రంగాలకు పెద్దపీట వేశారని కొనియాడారు. వ్యవసాయ రంగానికి రూ.24,439 కోట్లు కేటాయించి రైతు ప్రభుత్వంగా నిరూపించుకున్నామన్నారు. పేద ప్రజల అభ్యున్నతికి అధిక నిధులు కేటాయించినందుకు ఆర్థికశాఖ మంత్రి బట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓయూకు నిధుల పెంపు అభినందనీయం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఉస్మానియా యూనివర్సిటీ బ్లాక్‌గ్రాంట్స్‌ నిధులు పెంచడం పట్ల వీసీ ప్రొ.కుమార్‌ గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతంలో రాష్ట్ర బడ్జెట్‌ నుంచి రూ.492.09 కోట్లు రాగా 2025–26 సంవత్సరానికి గాను రూ.542.68 కోట్ల బ్లాక్‌గ్రాంట్స్‌ నిధులను ప్రకటించడం అభినందనీయమన్నారు. గతం కంటే రూ.50.59 కోట్ల నిధులను పెంచినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు, ఉన్నతాధికారులకు వీసీ కృతజ్ఞతలు తెలిపారు. గతంతో పోల్చుకుంటే ఓయూకు 10.28 శాతం బడ్జెట్‌ పెరిగిందన్నారు.

నీటి ఎద్దడిని నివారించండి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న బానుక నర్మద

బొల్లారం: కంటోన్మెంట్‌లో నీటి సరఫరా పెంపునకు సంబంధించిన నిర్ణయాలు అమలు కావడం లేదని బోర్డు నామినేటెడ్‌ సభ్యురాలు బానుక నర్మద మల్లికార్జున్‌ అన్నారు. ఈ మేరకు గురువారం ఆమె జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోర్డు పరిధిలో నీటి సరఫరాను 59 లక్షల గాలన్ల నుంచి 69 లక్షల గాలన్లకు పెంచాలని నిర్ణయించినప్పటికీ, ప్రస్తుతం 51–52 లక్షల గాలన్లు మాత్రమే అందుతున్నాయన్నారు. కంటోన్మెంట్‌ పరిధిలో 330 కిలోమీటర్ల వాటర్‌ లైన్స్‌, 10 పంప్‌ హౌస్‌లు ఉండటం వల్ల సరఫరాకు ఎటువంటి అవరోధం లేదని, అవసరమైతే రోజువారీ నీటి సరఫరా చేయగల సామర్థ్యం బోర్డుకు ఉందని స్పష్టం చేశారు. ఒప్పందం ప్రకారం పూర్తిస్థాయిలో నీటిని అందించాలని, స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ కూడా ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం

రాంగోపాల్‌పేట్‌: ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ అన్నారు. గురువారం ఆయన సికింద్రాబాద్‌ మండల కార్యాలయంలో సికింద్రాబాద్‌, అమీర్‌పేట్‌ మండలాలకు చెందిన 69 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్‌ చేశారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఇప్పటి వరకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. మహిళలకు రూ.2500 ఆర్థిక సహాయాన్ని గాలికి వదిలి వేశారన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, లేని పక్షంలో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్‌ తహసీల్దార్‌ పాండు నాయక్‌, కార్పొరేటర్‌లు కొలను లక్ష్మిబాల్‌రెడ్డి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్‌లు శేషకుమారి, అత్తిల్లి మల్లికార్జున్‌గౌడ్‌, నాయకులు కొలను బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌, ఆంజనేయులు, మహేష్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్‌

అలరించిన మహిళా సమ్మేళనం



గాయని కౌసల్యను సత్కరిస్తున్న కార్పొరేటర్లు

సికింద్రాబాద్‌: సీతాఫల్‌మండి డివిజన్‌ నామాలగుండు బీఎస్‌ఆర్‌ గార్డెన్‌లో గురువారం డివిజన్‌ బీఆర్‌ఎస్‌ మహిళా ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మేళనం సందడిగా సాగింది. ప్రముఖ గాయని కౌసల్య, సీతాఫల్‌మడి కార్పొరేటర్‌ సామల హేమ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం గాయని కౌసల్య, కార్పొరేటర్‌ సామల హేమ, మహిళా ఎస్‌ఐలు సబిత, కవిత, జలమండలి మేనేజర్‌ నవ్య, కుట్టివెల్లోడి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి ప్రత్యూష, బౌద్ధనగర్‌ కార్పొరేటర్‌ కంది శైలజ, మెట్టుగూడ కార్పొరేటర్‌ రాసూరి సునీత తదితరులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

అర్హులందరికీ రేషన్‌ కార్డులు ఇవ్వాలి

రాంగోపాల్‌పేట్‌: అర్హులైన పేదలందరికీ తెల్లరేషన్‌ కార్డులు మంజూరు చేయాలని సీపీఎం గ్రేటర్‌ హైదరాబాద్‌ సెంట్రల్‌ సిటీ కమిటీ కార్యదర్శి ఎం వెంకటేష్‌ అన్నారు. రేషన్‌ కార్డులు ఇవ్వాలని కోరుతూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఎస్పీరోడ్‌లోని సీఆర్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేష్‌ మాట్లాడుతూ గత ప్రభుత్వం రేషన్‌ కార్డుల విషయంలో ప్రజలకు అన్యాయం చేసిందన్నారు. కారు, బైకు ఉన్నాయన్న కారణంతో పదేళ్లలో నగరంలో 1.63లక్షల కార్డులను తొలగించారని ఆరోపించారు. కొత్తగా కేవలం 56,065 కార్డులను మాత్రమే ఇచ్చారని, కొత్త రేషన్‌ కార్డులు ఇచ్చిన దానికంటే తొలగించిన కార్డులే ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. అర్హులందరికీ రేషన్‌ కార్డులు ఇవ్వడంతో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన డిమాండ్‌ చేశారు. అనంతరం సీఆర్వో ఫణీంద్ర రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌, శ్రీనివాసరావు, దశరథ్‌,తమహేందర్‌, రాజన్న, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

విద్యారంగ బడ్జెట్‌పై పోరుబాట

ఉస్మానియా యూనివర్సిటీ: బడ్జెట్‌లో విద్యారంగానికి బడ్జెట్‌లో అతి తక్కువ నిధులు కేటాయించినందుకు నిరసనగా ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆల్‌ ఇండియా ఫార్వర్డ్‌ బ్లాక్‌ (ఏఐఎస్‌బీ) రాష్ట్ర కన్వీనర్‌ హకీమ్‌ నవీద్‌ అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యరంగానికి కేవలం రూ.23,108 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. ప్రభుత్వ వైఖరి కారణంగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ అందక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వచ్చే నెల 8 నుంచి ప్రారంభం కానున్న డిగ్రీ పరీక్షల బహిష్కరించాలని ప్రైవేటు కాలేజీ యజమాన్యాలు ఇచ్చిన పిలుపునకు మద్దతు ప్రకటించారు.

వేధింపుల కేసులో కానిస్టేబుల్‌ అరెస్ట్‌

అమీర్‌పేట: బీటెక్‌ విద్యార్థిని వేధిస్తున్న ఏఆర్‌ కానిస్టేబుల్‌ను ఎస్‌ఆర్‌నగర్‌ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్‌ శ్రీనాథ్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పేట్ల బురుజు హెడ్‌ క్వార్టర్‌లో ఏఆర్‌ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తేమలి పుజారా పరమేష్‌ ఎస్‌ఆర్‌నగర్‌ ఎస్‌ఆర్‌టీ కాలనీకి చెందిన బీటెక్‌ విద్యార్థినితో పరిచయం ఏర్పడింది. ఆమె ఫోన్‌ నంబర్‌ తీసుకున్న పరమేష్‌ తరచూ ఆమెకు ఫోన్లు చేస్తూ స్నేహాన్ని పెంచుకున్నాడు. ఇటీవల ఎస్‌ఆర్‌నగర్‌లోని ఓ కాఫీ షాప్‌ ఆమె ఫోన్‌ తీసుకుని అందులోని వివరాలను తన ఫోన్‌కు ఫార్వర్డ్‌ చేసుకున్న పరమేష్‌ ఆమె బ్లాక్‌ మెయిల్‌ చేస్తున్నాడు. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకోవాలని వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం నిందితుడిని అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు.

గృహిణి అదృశ్యం



అంజలి (ఫైల్‌)

చిలకలగూడ : ఓ మహిళ అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ జ్ఞానేశ్వర్‌ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మెట్టుగూడకు చెందిన సోనుచౌరాసియా భార్య అంజలి మారేడుపల్లిలో వంట మనిషిగా పనిచేస్తోంది. ఈనెల 19న రాత్రి సోను ఉద్యోగం డ్యూటీ నుంచి తిరిగి వచ్చే సరికి అంజలి ఇంట్లో కనిపించలేదు. ఆమె కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో భర్త సోను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యువతి అదృశ్యం



అర్చన(ఫైల్‌)

అడ్డగుట్ట: ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన తుకారాంగేట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ శంకర్‌ నాయక్‌ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తుకారాంగేట్‌లోని బోయబస్తీకి చెందిన గౌటి అర్చన(25) ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 19న డ్యూటీకి వెళ్లిన ఆమె ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఆమె కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో గురువారం తుకారాంగేట్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లాలాపేట హాస్పిటల్‌ పార్క్‌లో చెత్త తొలగింపు



'సాక్షి' ప్రచురితమైన కథనం



లాలాపేట హాస్పిటల్‌ పార్క్‌లో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

లాలాపేట: తార్నాక డివిజన్‌ లాలాపేటలోని పట్టణ సామాజిక కేంద్రంలో సరైన వైద్యం అందక పోగా హాస్పిటల్‌ పార్క్‌ నిర్వహణ కొరవడిన వైనంపై ఈ నెల 16న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం హార్టికల్చర్‌ అధికారిణి సింధుజ ఆధ్వర్యంలో హాస్పిటల్‌ చుట్టూ ఉన్న పార్కులో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్పిటల్‌ అధికారులు, జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా హాస్పిటల్‌ పార్క్‌ నిర్వహణ అధ్వానంగా మారిందన్నారు. ఇప్పటికైనా హాస్పిటల్‌ అధికారులు పార్క్‌ నిర్వహణపై శ్రద్ధ చూపాలన్నారు.

'గాంధీ'లో అదనంగా 30 ఎమర్జెన్సీ పడకలు



మాట్లాడుతున్న గాంధీ సూపరింటెండెంట్‌ రాజకుమారి

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్‌ గాంధీ ఆస్పత్రి ఎమర్జెన్సీ మెడికల్‌ డిపార్ట్‌మెంట్‌(ఈఎండీ)లో అదనంగా 30 పడకలు ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్‌ ప్రొఫెసర్‌ సీహెచ్‌ఎన్‌ రాజకుమారి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, ఆర్‌ఎంఓలు, సీఎంఓలు, ఆస్పత్రి పాలనా యంత్రాంగంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాణాపాయస్థితిలో వచ్చే రోగుల సంఖ్యకు అనుగుణంగా ఎమర్జెన్సీ పడకలను పెంచినట్లు తెలిపారు. ప్రస్తుతం 65 పడకల ఏఎంసీ, 30 పడకల టీఎంటీ విభాగాలు ఉండగా, అదనంగా పెంచిన 30తో కలిపి మొత్తం 125 ఎమర్జెన్సీ పడకలు అందుబాటులోకి వచ్చాయన్నారు. క్యాజువాలిటీ విభాగంలో పెంచిన పడకల్లో 15 శస్త్రచికిత్స, మరో 15 వైద్య చికిత్సల కోసం కేటాయించినట్లు ఆమె వివరించారు. నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామని, ఎమర్జెన్సీ విభాగంలో ప్రతిరోజు సుమారు 300 మందికి వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌ ప్రొఫెసర్‌ సునీల్‌కుమార్‌, ఆయా విభాగాల హెచ్‌ఓడీలు ప్రొఫెసర్‌ వాల్యా, రాజా రామ్‌, సునీల్‌కుమార్‌, పలువురు ఆర్‌ఎంఓలు, నర్సింగ్‌, పారామెడికల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ ఈటలకు జన్మదిన శుభాకాంక్షలు

రసూల్‌పురా: మల్కాజ్‌గిరి పార్లమెంట్‌ సభ్యులు ఈటల రాజేందర్‌ పుట్టిన రోజు సందర్భంగా కంటోన్మెంట్‌ నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు గురువారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.కంటోన్మెంట్‌ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవ రెడ్డి, మాణిక్‌రెడ్డి, అశోక్‌, పాండుయాదవ్‌, మణికంఠ, నాగరాజు తదితరులు శామీర్‌పేట లోని ఈటల రాజేందర్‌ నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

సనత్‌నగర్‌: రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని కాంగ్రెస్‌ పార్టీ సనత్‌నగర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టినందుకు గురువారం సీనియర్‌ నేత విశాల్‌ సూదం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంతరెడ్డి కటౌట్‌కు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ ఇది కాంగ్రెస్‌ విజయం మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల విజయమన్నారు. కాంగ్రెస్‌ పార్టీ ఎల్లప్పుడూ పేద ప్రజల పక్షాన ఉంటూ వారి అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించినందుకు జాతీయ నాయకులు రాహుల్‌ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తస్లీం, చిరంజీవి, బబ్లూ, హనీఫ్‌, అడ్డూ, మునీర్‌, కృష్ణ, జగదీష్‌, దేవేందర్‌, జులేఖ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి కటౌట్‌కు పాలాభిషేకం చేస్తున్న కోట నీలిమ, విశాల్‌ సూదం తదితరులు..